Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 328
పేజీలు : 3
శుక్రవారం 03.07.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## దేశవ్యాప్తంగా వర్షాలు

- ముంబయి అతలాకుతలం



**టీ మీడియా ,జూలై 2, ఢిల్లీ బ్యూరో :**
దేశంలో నైరుతి రుతుపవనాలు మరింత చురుగ్గా కదులుతున్నాయి. దీని ప్రభావంగా దేశవ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. గురువారం దేశ రాజధాని ఢిల్లీలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించగా, మరోవైపు ఆర్థిక రాజధాని ముంబయిని భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారి, రైల్వే రవాణాపై కూడా ప్రభావం పడింది. అటు ఉత్తరాఖండ్?లోని రుద్రప్రయాగ్?లో హైఅలర్ట్ ప్రకటించారు. హిమాచల్ ప్రదేశ్?లో వర్షాలకు ఆరుగురు మరణించారు.ఢిల్లీలోకి గురువారం నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. సాధారణంగా జూన్ 27న రాజధానికి చేరాల్సిన రుతుపవనాలు ఈసారి ఐదు రోజుల ఆలస్యంగా జూలై 3న ప్రవేశించాయని పేర్కొంది. రుతుపవనాల ప్రవేశంతో ఢిల్లీలో రోజంతా మేఘావృత వాతావరణం కొనసాగే అవకాశం ఉందని అంచనా వేసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

# రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు

- టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టులు
- విద్యార్థులతో పాటు టీచర్లకూ అల్పాహారం
- సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ

**టీ మీడియా ,జూలై 2, హైదరాబాద్ బ్యూరో :** సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ సచివాలయంలో కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో వీబీ జీ రామ్? జీ , మూసీ ప్రక్షాళన, ప్రభుత్వ ఉపాధ్యయులకు అల్పాహారం సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రిమండలి సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్? రెడ్డి మీడియాకు వివరాలను వెల్లడించారు.తొలిసారిగా పేపర్?లెస్? కేబినెట్? భేటీని నిర్వహించారు. రాష్ట్రంలో వీబీ జీ రామ్?జీ పథకాన్ని అమలు చేయాలని కేబినెట్?లో నిర్ణయం తీసుకున్నారు. అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు. మూసీ ప్రాజెక్టు మొదటి దశకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

విద్యా రంగంలో మరో వినూత్న నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అందుతున్న ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయాన్ని ఇకపై ఉపాధ్యాయులు, లెక్చరర్లు, బోధనేతర సిబ్బందికీ విస్తరించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన తొలి ఈ-కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదంవ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు పోషకాహార లోపానికి గురికాకుండా ఉండేందుకు చాలా కాలంగా మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉంది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకాన్ని కూడా ప్రవేశపెట్టగా, ఈ విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కళాశాలల విద్యార్థులకూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే ఏర్పాట్లు చేసింది. ఇప్పుడు అదే సదుపాయాన్ని విద్యార్థులకు బోధించే సిబ్బందికీ వర్తింపజేయాలని నిర్ణయించడం విశేషంగా మారింది. ఈ నిర్ణయం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి ప్రతిరోజూ ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించనున్నారు. దీంతో విద్యాసంస్థల్లో సిబ్బంది ఎక్కువ సమయం అందుబాటులో ఉండటంతో పాటు విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు స్వాగతిస్తున్నాయి. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఇది దోహదపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

కేబినెట్ నిర్ణయాలు రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని కేబినెట్ నిర్ణయం,అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మంత్రిమండలి నిర్ణయం, మూసీ ప్రాజెక్టు మొదటి దశకు కేబినెట్ ఆమోదం,రూ. 7,345 కోట్లతో మూసీ మొదటి దశ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం,టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టులు మంజూరుకు ఆమోదం,గోదాములు, విద్యాలయాలు, సంస్థల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని నిర్ణయం,టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టులు మంజూరు,మూసీ ప్రక్షాళనలో భాగంగా రూ. 7,345 కోట్లతో ఫేజ్-1 కోసం టెండర్లు పిలిచేందుకు కేబినెట్ ఆమోదం,12వ తరగతి వరకు అల్పాహారం, పాలు, మధ్యాహ్నభోజనం ఇవ్వాలని నిర్ణయం, విద్యార్థులతోపాటు, టీచర్లు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అల్పాహారం, పాలు, మధ్యాహ్నభోజనం ఇవ్వాలని నిర్ణయం.

**విజ్ఞప్తులకు సర్కార్ సానుకూల స్పందన.**





రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నుంచి, సిబ్బంది నుంచి ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి ,మంత్రివర్గం అధ్యాపకులు ఇతర అనధికారిక సిబ్బందికి కూడా ఉచితంగా అల్పాహారం (బ్రేక్ ఫాస్ట్), మధ్యాహ్న భోజనం (లంచ్) అందించాలని సానుకూలంగా స్పందించింది. ఉపాధ్యాయులు మరియు స్కూల్ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, ఒత్తిడి లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని క్యాబినెట్ అభిప్రాయపడింది. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. విద్యార్థులతో పాటు ఒకే పంక్తిలో ఉపాధ్యాయులు కూడా భోజనం చేయడం వల్ల పాఠశాలల్లో సమానత్వం పెంపొందడమే కాకుండా, భోజనం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి వీలవుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయంపై ఉపాధ్యాయ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

## అప్పుల చర్చపై సవాళ్లు

- జూపల్లి కోసం తెలంగాణ భవన్‌లో కుర్చీ



**టీ మీడియా ,జూలై 2, హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలో రాష్ట్ర అప్పుల అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య చెలరేగిన సవాళ్ల పర్వం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అప్పుల లెక్కలపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించడంతో.. బీఆర్ఎస్ నేతలు అందుకు పూర్తి ఏర్పాట్లు చేశారు. తెలంగాణ భవన్ వేదికగా మంత్రి జూపల్లి కోసం ప్రత్యేకంగా ఆయన పేరు రాసి ఉన్న ఒక కుర్చీని కూడా సిద్ధం చేసి, బీఆర్ఎస్ శ్రేణులు ఆయన రాక కోసం వేచి చూశాయి.

**గన్‌పార్క్‌కు వెళ్లిన మంత్రి జూపల్లి**

అయితే, ముందుగా అనుకున్నట్లు తెలంగాణ భవన్‌కు వెళ్లకుండా మంత్రి జూపల్లి కృష్ణారావు నేరుగా గన్‌పార్క్‌కు చేరుకున్నారు. గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్దకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులే నేరుగా వచ్చి చర్చకు కూర్చోవాలంటూ జూపల్లి అక్కడ నుండి సరికొత్త సవాల్ విసిరారు. దీంతో ఇరుపక్షాల మధ్య సవాళ్లు మరింత ముదిరాయి. మంత్రి జూపల్లి సవాల్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు పాదయాత్రగా వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆయనతో పాటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు గన్‌పార్క్ వైపు నడిచేందుకు బయలుదేరారు. అయితే, శాంతిభద్రతల

మిగతా 3లో..


**టీ మీడియా ,జూలై 2, హైదరాబాద్ బ్యూరో:**
తెలంగాణ రాజకీయం ప్రస్తుతం తీవ్ర స్థాయికి చేరుకుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య నడుస్తున్న 'డేట్, టైమ్, లొకేషన్' సవాళ్లు రాష్ట్రంలో పొలిటికల్ హీట్‌ను పీక్స్‌కు తీసుకెళ్లాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని రూ. 7 లక్షల కోట్ల అప్పులపై చర్చకు రావాలంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌కు.. కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరూ కలిసి గన్‌పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. మరోవైపు, గురుకులాల విద్యాశాఖలో జరిగిన అవినీతి, కొనుగోళ్లపై కాంగ్రెస్ మంత్రులు చర్చకు సిద్ధమవడంతో హైదరాబాద్ ఒక్కసారిగా అట్టుడికిపోయింది.ఈ సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో రాజధానిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గురుకులాల కొనుగోలు ప్రక్రియ మొత్తం నాలుగు శాఖల ఆధ్వర్యంలో పారదర్శకంగా జరిగిందని, బీఆర్ఎస్ నేతలవి అబద్ధాలని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. పదేళ్లుగా బీఆర్ఎస్ చేసిన ప్రొక్యూర్‌మెంట్‌పై కూడా చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. సవాల్ నేపథ్యంలోనే మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ తదితరులు గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్ నేతలను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు రావాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులపై చర్చకు తాము సిద్ధమంటూ బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. మంత్రి జూపల్లి చెప్పినట్లు కేటీఆర్ తెలంగాణ భవన్‌లోనే ఉంటారని, తాను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గన్‌పార్క్‌కు వెళ్తానని హరీశ్‌రావు ప్రకటించారు. అయితే హరీశ్‌రావు వాహనాన్ని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. "సవాల్ విసిరితే అప్పుల లెక్క చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మేము వస్తాము అంటే పోలీసులు, ముగ్గురు మంత్రులకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు" అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.పోలీసుల అడ్డగింతతో కారు దిగిన హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు గన్‌పార్క్ వైపు నడుచుకుంటూ బయలుదేరారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు మిన్నంటాయి. పోలీసుల వలయాన్ని తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులను అడ్డంపెట్టి అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

## తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్..

### పోలీసుల అదుపులో హరీష్ సహా బీఆర్ఎస్ నేతలు



## కీవ్‌పై రష్యా భీకర దాడులు



- 8మంది మృతి- అనేక మందికి గాయాలు

**టీ మీడియా ,జూలై 2, ఢిల్లీ బ్యూరో :**
ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో రష్యా భీకర దాడులకు పాల్పడింది. రష్యా దాడులతో కీవ్ నగరం గంటల తరబడి బాంబుల మోతలతో దద్దరిల్లింది. పలు నివాస భవనాలు ధ్వంసం కాగా 8 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. భయాందోళనలకు గురైన ప్రజలు బంకర్లు, మెట్రో స్టేషన్లలో తలదాచుకున్నారు.రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తారస్థాయికి చేరాయి. ఉక్రెయిన్ రాజధాని కీవ్ లక్ష్యంగా రష్యా విరుచుకుపడింది. డ్నీపర్ నదికి ఇరువైపులా ఉన్న కీవ్‌లోని మొత్తం 10 జిల్లాలపై రష్యా దాడుల ప్రభావం పడింది. అనేక బహుళ అంతస్తుల భవనాలు దెబ్బతిన్నాయి. రష్యా దాడుల్లో 8 మంది మరణించారని, అనేక మంది గాయపడినట్లు కీవ్ మేయర్ విటాలీ క్లిట్ష్కో వెల్లడించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇతర ఉన్నతాధికారుల హెచ్చరికలతో అప్రమత్తమైన కీవ్ నగరవాసులు ప్రాణభయంతో ముందుగానే మెట్రో స్టేషన్లలోకి పరుగులు తీశారు. ఈ దాడులు కీవ్ నగరవ్యాప్తంగా విధ్వంసం సృష్టించాయి. డెస్నియాన్‌స్కీ జిల్లాలో ఓ 9 అంతస్తుల భవనం పాక్షికంగా ధ్వంసం కాగా, అందులో పలువురు చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. హోలోసివ్‌స్కీ జిల్లాలోని ఓ బహుళ అంతస్తుల భవనంపై మంటలు చెలరేగాయి. కొన్ని చోట్ల శిథిలాల కింద పలువురు ఇరుక్కుపోయారు. అనేక జిల్లాల్లో భారీ ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు.ఇటీవల కాలంలో ఉక్రెయిన్ సైన్యం కూడా రష్యాలోని సైనిక స్థావరాలు, ఇంధన కేంద్రాలపై డ్రోన్లతో సుదూర దాడులు చేస్తోంది. దీనివల్ల రష్యాలో ఇంధన కొరత ఏర్పడి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఈ దాడులకు ప్రతీకారంగానే రష్యా ఇప్పుడు కీవ్‌పై పగబట్టి దాడులను ఉద్ధృతం చేసింది. ఇది శత్రువులు చేస్తున్న అత్యంత క్రూరమైన దాడి అని కీవ్ మేయర్ అభివర్ణించారు. ప్రజలు ఎవరూ కూడా షెల్టర్ల నుంచి బయటకు రావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మణిపూర్‌లో మళ్లీ తెగల మధ్య ఘర్షణ..

- ఇరవైకిపైగా ఇళ్ల దగ్ధం



**టీ మీడియా ,జూలై 2, మణిపూర్ :**
రాష్ట్రంలో మళ్లీ హింస చెలరేగింది. భారత్-మయన్మార్ సరిహద్దు సమీపంలోని కామ్‌జోంగ్ జిల్లా లో బుధవారం నాగా, కుకీసామాజిక వర్గాల మధ్య సాయుధ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇరువర్గాలకు చెందిన సాయుధ బృందాలు పరస్పరం దాడులు చేసుకోవడంతోపాటు గ్రామాల్లోని 20కిపైగా ఇళ్లకు నిప్పుపెట్టారు. ఉదయం ఒక కుకీ గ్రామం నుంచి వచ్చిన సాయుధులు సమీపంలోని నాగా గ్రామంపై దాడిచేసి 10 ఇళ్లను తగలబెట్టడంతో ఈ హింస ప్రారంభమైంది.ఆ తర్వాత మధ్యాహ్నం దీనికి ప్రతికారంగా మరో వర్గం జరిపిన ఎదురుదాడుల్లో నాగా కమ్యూనిటీకి చెందిన ఇంకో 12 ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఉద్రిక్తతలను అదుపు చేయడానికి అదనపు భద్రతా బలగాలను రంగంలోకి దించి, ఆయా గ్రామాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. జూన్ 11న కాంగ్‌పోక్‌పి జిల్లాలో ఆరుగురు నాగా పౌరుల మృతదేహాలు లభించడం, అంతకుముందు మే 13న వారిని కొందరు అపహరించడమే ఈ తాజా హింసకు ప్రధాన కారణమని తెలుస్తోంది.

ఈ హత్యల తర్వాత రెండు వర్గాల మధ్య తీవ్ర నిరసనలు, ఆర్థిక దిగ్బంధనాలు జరిగాయి.కుకీలు నివసించే ప్రాంతాలకు నిత్యావసర వస్తువుల రవాణా వాహనాల కదలికలపై వివాదాలు రేగడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అయితే బుధవారం జరిగిన ఘర్షణల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ తాజా దాడిపై ప్రముఖ కుకీ సంస్థ 'కుకీ ఇన్పి మణిపూర్' తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నాగా ఆధిపత్యం ఉన్న కొండ ప్రాంతాల్లోని కుకీ గ్రామాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించింది. భద్రతా బలగాల రక్షణలో ఉన్న సదరు గ్రామం నుంచి, వారు పోస్ట్‌ను ఖాళీ చేసి వెళ్లిన మరుసటి రోజే ఈ దాడి జరగడం వెనుక భద్రతా లోపాలు ఉన్నాయని, దీనిపై తక్షణమే పారదర్శక విచారణ జరపాలని డిమాండ్ చేసింది.మరోవైపు ఆరుగురు నాగా పౌరుల హత్యకు తమవాళ్లే కారణమని ఒప్పుకుంటూ 'కుకీ-జో కౌన్సిల్' ఛైర్మన్ హెన్లియాంతంగ్ థాంగ్లెట్ ఇటీవల క్షమాపణలు చెప్పారు. ఆవేశంలో జరిగిపోయిన ఆ తప్పుపై నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. అయితే వివిధ నాగా గ్రూపులు ఈ క్షమాపణలను తిరస్కరించాయి. ఆ క్షమాపణల్లో నిజాయతీ లేదని, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాల్సిందేనని పట్టుబడుతున్నాయి. ఈ పాత కక్షల నేపథ్యమే ఇప్పుడు కామ్‌జోంగ్ జిల్లాను మళ్లీ అశాంతి వైపు నెట్టింది.

## చెప్పింది తప్పయితే రాజీనామాకు సిద్ధం

- కేసీఆర్‌తో చెప్పించాలన్న మంత్రి జూపల్లి

**టీ మీడియా ,జూలై 2, హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్ర అప్పులపై బుధవారం తాను చెప్పిన అంకెలు తప్పయితే రాజీనామా చేసేందుకు సిద్ధమని ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. తన వద్ద అప్పులకు సంబంధించి అన్ని రికార్డులూ ఉన్నాయని, బీఆర్?ఎస్? నేతలు చర్చకు రావాలని మరోసారి సవాల్? విసిరారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్?ఎస్? ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6 వేల కోట్లు వడ్డీ కడుతున్నామన్న ఆయన, దీనిపై మాజీ సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.గొప్పగా పరిపాలన చేసుంటే మీమ్మల్నీ ఎందుకు మారుస్తారు : అంతకుముందు మంత్రి జూపల్లి కృష్ణారావు గాంధీ భవన్?లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్?ఎస్ పాలనలో చేసిన అప్పుపై ఆ పార్టీ నేతలు చెబుతున్నవి పచ్చి అబద్దాలని, వాటిపై చర్చించేందుకు ఈ రోజు తెలంగాణ భవన్‌కు వస్తానని బుధవారం మీడియా సమావేశంలో సవాల్ విసిరారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి అవసరం లేదని తానే స్వయంగా వస్తానని అన్నారు. పదేళ్లు కేసీఆర్ గొప్పగా పరిపాలన చేసి ఉంటే ప్రజలు ప్రభుత్వాన్ని ఎందుకు మార్చారో చెప్పాలని మంత్రి ప్రశ్నించారు.కేసీఆర్ బయటకు వచ్చి చెప్పాలి : తన మాట అబద్ధమైతే కేసీఆర్‌తో అప్పుల విషయంపై మాట్లాడాలని కోరుతున్నట్లు మంత్రి జూపల్లి తెలిపారు. పదేళ్లపాటు మీరు చేసిన అప్పుల గురించి కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను మీడియాకు చెప్పాలన్న ఆయన బీఆర్ఎస్ చేసిన అప్పు కళ్లకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని పేర్కొన్నారు.

**కార్పొరేషన్? పెట్టి రూ.లక్షల కోట్లు తెచ్చారు**

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలపై చర్చకు ఇప్పటికీ సిద్ధంగానే ఉన్నట్లు మంత్రి జూపల్లి స్పష్టం చేశారు.



బీఆర్ఎస్ హయాంలో మొత్తం రూ.7.3 లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపించారు. కేవలం ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.74 వేల కోట్లు అప్పు చేశారన్న ఆయన వివిధ సంస్థల పేరుతో రూ.లక్షల కోట్లు తీసుకొచ్చారన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. తాము అప్పులు చేయలేదని కేసీఆర్‌ను చెప్పాలన్న ఆయన తాను చెప్పింది అబద్ధమైతే తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు.ఆ డబ్బులను రైతుల నుంచి వసూలు చేస్తారా? : కార్పొరేషన్ పేరుతో అప్పు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారని దానికి చేసిన అప్పును రైతుల నుంచి వసూలు చేస్తారా? అని మంత్రి జూపల్లి ప్రశ్నించారు. ఒక్కో రైతు నుంచి రూ.20 లక్షలు వసూలు చేస్తారా? అని ధ్వజమెత్తారు. తాను చెప్పిన అంకెలు తప్పయితే రాజీనామా చేసేందుకు సిద్ధమన్నారు.

# తెలంగాణలో ఎన్యూమరేషన్

● పత్రాల పంపిణీ, నింపడంలో గందరగోళం

**టీ మీడియా ,జూలై 2, హైదరాబాద్ బ్యూరో :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా బూత్? లెవల్? ఆఫీసర్లు ప్రస్తుతం ఇంటింటికీ ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లుండగా బుధవారం నాటికి 2,36,16,159 (69.82శాతం) గణన అప్లికేషన్లు అందించినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. హైదరాబాద్‌లాంటి నగరాల చోట్ల అయితే ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ చాలా తక్కువగా జరిగినట్టు తెలుస్తోంది.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల బీఎల్‌వోల నుంచి గంపగుత్తగా బీఎల్ఏలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. రాష్ట్రంలో జూన్ 25న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ ప్రారంభం కాగా స్వీకరణకు జులై 24 వరకు గడువుగా పెట్టారు. మొదటి వారంలో ఓటర్లందరికీ పంపిణీ చేసి, మిగతా మూడు వారాల్లో నింపిన అప్లికేషన్ ఫారాలను తీసుకోవాలని బీఎల్‌వోలకు ఎన్నికల అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి.

**ఓటు గల్లంతు అవుతుందేమోనని భయం**

అయితే మొదటగా పత్రాలు ఎలా నింపాలో ఓటర్లకు వివరించడంలో పలువురు పోలింగ్ బూత్ అధికారులు పూర్తిగా అయోమయానికి



గురవుతున్నారు. సందేహాల నివృత్తి కోసం వారికి ఫోన్ చేసినా ఏ మాత్రం స్పందించడం లేదని జనాలు చెబుతున్నారు. 2002 ఓటరు కార్డుకు అనుగుణంగా వివరాలు పూరించాలనే నిబంధన ఉంది. దీని కారణంగా ఓటరు కార్డులో పేరు, చిరునామా వంటివి తప్పుగా ఉన్నవారు మళ్లీ అదే విధంగా నమోదు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి దాపురించింది. ఫారంలో ఏ చిన్న పొరపాటు దొర్లినా ఓటు గల్లంతు అవుతుందనే భయం పత్రాల భర్తీ ప్రక్రియను మరింత ఆలస్యం చేస్తోంది.

**బీఎల్‌వోలకు మరోసారి శిక్షణ**

రాష్ట్రంలో ఈ సర్? ప్రక్రియలో మొత్తం 35,985 మంది బీఎల్‌వోలు ఉన్నారు. సర్వే ప్రారంభంకాక ముందే మండల స్థాయిలో వీరికి ట్రైనింగ్ ఇచ్చారు. అదేసమయంలో వీరు ఇతర విధులు కూడా నిర్వర్తించడంతో సరిగా హాజరు కాలేకపోయారు. హాజరైన వారిలోనూ పలువురికి ఎన్యూమరేషన్ పత్రం నింపడంపై పూర్తిస్థాయిలో అవగాహన లేదు. పత్రాన్ని ఎలా నింపాలని ఓటర్లు అడిగినప్పుడు పలువురు ఏం చెప్పాలో తెలియక తికమకపడుతున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలకు మరోసారి ట్రైనింగ్ ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారులకు (డీఈవోలు) రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయం సూచించింది. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లను చూస్తున్నారు.

**వెలుగుచూసిన విషయాలు**

ఇంటింటికీ తిరిగి ఎన్యూమరేషన్ అప్లికేషన్లు ఇవ్వాల్సిన బీఎల్‌వోలు ఏదో ఒక చోట కూర్చొని అందరిని అక్కడికి వచ్చి తీసుకోవాలని పిలుస్తున్నారు. జీవనోపాధి కోసం గల్ఫ్ ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలు సేకరించడం చాలా క్లిష్టంగా మారుతోంది. ఉత్తర తెలంగాణలో పలు జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతోంది. పల్లెల్లో వ్యవసాయం, కూలి పనులకు వెళ్తున్న వారికోసం ఉదయం 6 నుంచి 9, లేదా రాత్రి వేళల్లో ఇంటింటికీ వెళ్లాల్సి వస్తోందని బీఎల్‌వోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగులు ఎక్కువగా ఉండే చోట పగలు ఇళ్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. సాయంత్రం వేళ వెళితేగానీ ఓటర్లను కలుసుకోలేని పరిస్థితులు ఉన్నాయి.

యాప్‌లో వివరాలు సరిపోలడానికి వయసు కీలకం అవుతోంది. 2002 నాటి వయసుకు, ప్రస్తుతానికి 22 నుంచి 23 సంవత్సరాల వ్యత్యాసం కచ్చితంగా సరిపోలితేనే యాప్ వివరాలను తీసుకుంటుంది. లేనిపక్షంలో వెంటనే తిరస్కరణకు గురవుతోంది.

## డీజీపీ ఆఫీస్ డీఎస్పీ ఇంట్లో ఏసీబీ కలకలం

● భారీగా బంగారం, వెండి, విదేశీ మద్యం సీజ్

**టీ మీడియా ,జూలై 2, హైదరాబాద్ బ్యూరో :**



హైదరాబాద్ మహానగరంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి భారీ సోదాలతో విరుచుకుపడ్డారు. తెలంగాణ డీజీపీ కార్యాలయంలోని కంప్యూటర్స్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న భీమ్ రెడ్డి లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే నమ్మదగిన సమాచారం, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో రంగంలోకి దిగారు. హైదరాబాద్ నగరంలోని తారామతి బారామతి ప్రాంతంలో ఉన్న భీమ్ రెడ్డి లగ్జరీ విల్లాతో పాటు, ఆయనకు సంబంధించిన సన్నిహితులు, బంధువుల ఇళ్లే లక్ష్యంగా సుమారు పది ప్రాంతాల్లో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. గురువారం (జూలై 02) ఉదయం నుంచే ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. ఇప్పటివరకు జరిగిన సోదాల్లో భీమ్ రెడ్డి నివాసం నుండి భారీగా అక్రమ ఆస్తులను అధికారులు గుర్తించారు. ఆయన ఇంట్లో పెద్ద ఎత్తున బంగారు, వెండి ఆభరణాలతో పాటు వెండి బిందెలను కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఇంట్లో నిల్వ ఉంచిన భారీ మొత్తంలో విదేశీ మద్యం బాటిళ్లను సైతం అధికారులు కనుగొన్నారు. పలు కీలకమైన ల్యాండ్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు, వాటి విలువను లెక్కగట్టే పనిలో పడ్డారు. సోదాలు ఇంకా కొనసాగుతుండటంతో, భీమ్ రెడ్డి అక్రమాస్తుల విలువ మరిన్ని కోట్ల రూపాయల్లో తేలే అవకాశం ఉందని ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపుతోంది.

## 8 నుంచి మారనున్న విమాన సర్వీసులు

**టీ మీడియా ,జూలై 2, విశాఖపట్నం:**

విమాన ప్రయాణంలో జూలై 8 నుంచి కొత్త శకం మొదలుకానుంది. మెజారిటీ విమాన సంస్థలు తమ కార్యకలాపాలను భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మారుస్తున్నాయి. దీంతో పాత నేవీ బేస్‌లో పౌర విమానాల రాకపోకలు నిలిచిపోనున్నాయి. డొమెస్టిక్ విమానాల షెడ్యూల్స్‌లో మార్పులు ఉన్నందున ప్రయాణికులు తమ టికెట్లను ఒకసారి సరిచూసుకోవడం మంచిది. ప్రధాన విమాన సంస్థలన్నీ జూలై 8నే మారుతున్నప్పటికీ, స్కూట్ (గ్రాషీశీ) ఎయిర్‌లైన్స్ మాత్రం జూలై 25 నుంచి భోగాపురం నుంచి




నడవనుంది. అంతర్జాతీయ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఈ మార్పును దశలవారీగా చేపడుతున్నారు. కొత్త కోడ్‌ల కోసం ప్రయాణికులు తమ పీఎన్ఆర్ స్టేటస్‌ను చెక్ చేసుకోవాలి. ఈ కొత్త ఎయిర్‌పోర్ట్ వల్ల ఉత్తరాంధ్ర జిల్లాలకు కనెక్టివిటీ మరింత పెరగనుంది. విశాఖ సిటీ నుంచి భోగాపురం సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

**కొత్త టెర్మినల్స్‌లో ఇబ్బంది లేకుండా**

భోగాపురం ఎయిర్‌పోర్ట్: ప్రయాణ సమయం, రవాణా వివరాలు హైవే ట్రాఫిక్ వల్ల విమానం మిస్ అవ్వకుండా ఉండాలంటే ప్రయాణాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలి. కొత్త టెర్మినల్స్‌లో ఇబ్బంది లేకుండా ఉండేందుకు వెబ్ చెక్-ఇన్ చేసుకోవడం ఉత్తమం. ఎక్కువ లగేజీతో వెళ్లేవారు చెక్-ఇన్ కౌంటర్ల వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకుని కాస్త త్వరగా వెళ్లడం మంచిది. దీనివల్ల ప్రయాణం సాఫీగా సాగుతుంది. కొత్త ఎయిర్‌పోర్ట్‌లో ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ మార్పును పక్కాగా ప్లాన్ చేశారు. వచ్చే వారం నుంచి మెజారిటీ డొమెస్టిక్ విమానాలు భోగాపురం నుంచే రాకపోకలు సాగిస్తాయి. ఈ మార్పుతో వైజాగ్ త్వరలోనే పెద్ద టెక్ హబ్‌గా ఎదగనుంది.

## బీజేపీ విజయమే లక్ష్యంగాపనిచేయాలి

**టీ మీడియా, జూన్ 2, అమరచింత:**



వనపర్తి జిల్లా అమరచింత చేనేత సహకార సంఘం ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, చేనేత సభ్యుడు సమిష్టిగా పనిచేయాలని అమరచింత పట్టణ బీజేపీ అధ్యక్షురాలు డా. మంగ లావణ్య పిలుపునిచ్చారు. పార్టీకి చెందిన చేనేత కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ, గత నాలుగు పర్యాయాలుగా చేనేత సహకార సంఘంపై బీజేపీ విజయపతాకం ఎగురవేసిందని, అదే విజయ పరంపరను ఈసారి కూడా కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ చేనేత సంఘం అధ్యక్షుడు మహంకాళి రాజు మాట్లాడుతూ, రేపటి నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పోటీ చేయదలచిన ఆశావహులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. చేనేత సహకార సంఘంలో బీజేపీ జెండా ఎగరేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే మాజీ చేనేత సంఘ సభ్యులు జన్ను నాగరాజు, నరాల నారాయణ, కొంగరి భాస్కర్ మాట్లాడుతూ, మొత్తం 9 మంది డైరెక్టర్లలో కనీసం ఇద్దరు మహిళలకు అవకాశం ఉంటుందని ఆ దిశగానే ఎన్నికలు జరుగుతాయన్నారు. పార్టీ బలోపేతం, చేనేత కార్మికుల సంక్షేమం లక్ష్యంగా బలమైన బృందాన్ని ఎంపిక చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఆశావహులు తమ పేర్లను అధికారికంగా నమోదు చేసుకున్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించేలా అందరూ ఐక్యంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గత మున్సిపల్ ఎన్నికలలో ఏ విధంగా ఐతే బీజేపీ గట్టి పోటీ ఇచ్చిందో అదే స్థాయిలో కలసి కట్టుగా పని చేసి చేనేత సొసైటీ పై బీజేపీ జెండా ఎగురవేయాలని 8వ వార్డు కౌన్సిలర్ మేర్వ రాజు అన్నారు. 5 ఏళ్లలో సొసైటీ సభ్యులు చేనేత కార్మికులకీ అండగా ఉంటూ పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు 10 వ వార్డు కౌన్సిలర్ పారుపల్లి ఉషన్న మరాఠీ అశోక్. క్యామ భాస్కర్. తిరుమల రఘు. క్యామా శ్రీను. వగ్గు రామ లింగం. సాంబారు సత్యనారాయణ. చిన్ని శ్రీను. గోపి. తిరుమల సత్యనారాయణ. తిరుమల నరసింహ. గోవర్ధన్. రమేష్. తదితరులు పాల్గొన్నారు.

## మేక మాంసంలో ఎద్దు మాంసం

● అమ్మకాలు ముఠాల గుట్టును రట్టు

**టీ మీడియా ,జూలై 2, హైదరాబాద్ బ్యూరో :**



హైదరాబాద్ నగరంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ముఠాల గుట్టును రట్టు చేసేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరుపుతున్న తనిఖీల్లో వరుసగా దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా నగరంలో కల్తీ మటన్ (కల్తీ మేక మాంసం) విక్రయిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో అధికారులు భారీ దాడి నిర్వహించారు. హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లెపల్లిలో మేక మాంసంలో ఎద్దు మాంసాన్ని అత్యంత చాకచక్యంగా కలిపి, తక్కువ ధరకే నగరంలోని పలు బిర్యానీ పాయింట్లు హోటళ్లకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ అక్రమ ధందాకు పాల్పడుతున్న ఉస్మాన్ ఖురేషి అనే ప్రధాన నిందితుడిని హైదరాబాద్ ఫుడ్ సేఫ్టీ అండ్ యాంటీ-అడల్టరేషన్ టాస్క్‌ఫోర్స్ , స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అరెస్ట్ చేశారు.

**హోటళ్ల నిర్వాహకుల్లో గుబులు**

నిందితుడు ఉస్మాన్ ఖురేషికి చెందిన మల్లెపల్లిలోని మటన్ షాపుపై ఫుడ్ సేఫ్టీ అధికారులు మెరుపు దాడి చేసి, విక్రయానికి సిద్ధంగా ఉంచిన సుమారు 50 కేజీల కల్తీ మాంసాన్ని అక్కడికక్కడే సీజ్ చేశారు. పట్టుబడిన మాంసం నమూనాలను ల్యాబొరేటరీ పరీక్షల నిమిత్తం స్టేట్ ఫుడ్ లాబొరేటరీకి తరలించారు. నిందితుడిపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. కేవలం లాభార్జనే ధ్యేయంగా హోటళ్లకు ఈ కల్తీ మాంసాన్ని సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో, ఈ మాంసాన్ని కొనుగోలు చేసిన హోటళ్ల జాబితాను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. ఈ పరిణామంతో నగరంలోని హోటల్ నిర్వాహకుల్లో తీవ్ర గుబులు మొదలవగా, బయటి ఆహారం తినేందుకు మాంసాహార ప్రియులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

## 'పని చేయకపోతే వీఆర్ఎస్ తీసుకుని వెళ్లిపోండి'

● మున్సిపల్ సిబ్బందిపై కలెక్టర్ సీరియస్

**టీ మీడియా ,జూలై 2, అమరావతి :**



"పని చేయనప్పుడు మీకు ఉద్యోగం ఎందుకు? ప్రతి నెలా జీతం ఎందుకు తీసుకుంటున్నారు? ప్రభుత్వ కార్యాలయం అంటే సత్రం అనుకుంటున్నారా? తక్షణమే మీ పద్ధతి మార్చుకోండి. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే ఊరుకునే ప్రసక్తే లేదు. లేదా ఉద్యోగానికి వీఆర్ఎస్ పెట్టి ఇంటికి వెళ్లిపోండి" అంటూ ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు మున్సిపల్ సిబ్బందిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

**కుర్చీల్లో కూర్చుని ఏం చేస్తున్నారు?**

కలెక్టర్ రాజాబాబు ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకోగానే ముందస్తు సమాచారం లేకపోవడంతో సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కార్యాలయంలోని ప్రతి విభాగాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఏ సెక్షన్?లో ఎంత మంది పని చేస్తున్నారు? వారి బాధ్యతలు ఏమిటి? తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి ఉద్యోగి జాబ్ చార్ట్?ను క్షుణ్ణంగా పరిశీలించారు. వారు కుర్చీల్లో కూర్చుని ఆ సమయంలో చేస్తున్న పనిని ప్రత్యక్షంగా గమనించారు. ఈ తనిఖీల్లో పలువురు ఉద్యోగుల తీరుపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించారు. ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను గాలికి వదిలేస్తే ఎలా అని నిలదీశారు. పనితీరు మార్చుకోకపోతే ఇక నుంచి ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాలను ఇష్టం వచ్చినట్లు వాడుకుంటామంటే కుదరదని మండిపడ్డారు. పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు.

**గంటన్నర పాటు తనిఖీ**

సుమారు గంటన్నర పాటు కార్పొరేషన్?లో కలెక్టర్ తనిఖీలు సాగాయి. ఆఫీసులోని ప్రతి గదికీ ఆయన వెళ్లారు. ఫైళ్ల నిర్వహణ ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. పెండింగ్ ఫైల్స్?ను వెంటనే క్లియర్ చేయాలన్నారు. ఎక్కడా కూడా ఫైళ్లు పేరుకుపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉన్నతాధికారులదేనని గుర్తు చేశారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ విభాగంలోని సిబ్బందిని తక్షణమే మార్చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై కూడా ఆయన ఆరా తీశారు. పారిశుద్ధ్య విభాగాన్ని మినహాయించి, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది పూర్తి వివరాలను తనకు సమర్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే యాక్షన్ తప్పదు**

కార్యాలయంలో క్రమశిక్షణపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ విధానంలోనే హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. విధుల్లో భాగంగా ఫీల్డ్ వర్క్?కు బయటకు వెళ్లే సమయంలో మూమెంట్ రిజిస్టర్?లో కచ్చితంగా సంతకం చేయాలన్నారు. ఈ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్?కు సూచించారు. కార్పొరేషన్ ప్రాంగణంతో పాటు కార్యాలయం లోపల కూడా పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పక్కదారి పడుతున్న యూరియా

● ఆగని సొసైటీ, డీలర్ల మాయజాలం

**టీ మీడియా ,జూలై 2, హైదరాబాద్ బ్యూరో :**

ఓవైపు యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు అన్నదాతలకు అందాల్సిన ఎరువులు పక్కదారి పడుతున్నాయి. యూరియా పంపిణీకి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నా డీలర్లు, సొసైటీల మాయాజాలం ఆగడం లేదు. తమకు రావాల్సిన ఎరువుల బస్తాలు మాయమవుతున్నాయని కర్షకులు వాపోతున్నారు. ప్రభుత్వం పారదర్శకంగా యూరియా పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఆగని సొసైటీ, డీలర్ల మాయజాలం**

ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక యాప్ తీసుకొచ్చింది. యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు ఎరువులు అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో మాత్రం యూరియా సరఫరా సక్రమంగా జరగడంలేదు. కామారెడ్డి జిల్లాలో సొసైటీలు, ప్రైవేటు డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.



సహకార సంఘాల్లోనూ యూరియా పక్కదారి పట్టడం అధికారుల డొల్లతనాన్ని బయటపెడుతోంది. బుకింగ్ యాప్‌తో సంబంధం లేకుండా బస్తాలు మాయం అవుతుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**యాప్?లో చూపించని ప్రైవేట్ డీలర్లు**

ఎరువుల యాప్‌లో భూమి వివరాలు నమోదైన రైతులు యూరియా బుక్ చేసుకుంటున్నారు. బుక్ చేసుకున్న యూరియా 48 గంటల్లోపు తీసుకునే అవకాశం ఉంది. బుక్ చేసిన వెంటనే డీలర్లు, సొసైటీల దగ్గరికి వెళ్తే స్టాక్ లేదనే సమాధానం వినిపిస్తోంది. జుక్కల్ ప్రాంతంలోని ఓ ఎరువుల డీలర్ దగ్గర వందలాది యూరియా బస్తాలు ఉన్నా యాప్‌లో మాత్రం లేనట్లు చూపిస్తోంది. మాచారెడ్డి సొసైటీలో 103 యూరియా బస్తాలు మాయం కావడం చర్చనీయాంశమైంది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న రైతులు బస్తాల కోసం సొసైటీకి వెళ్లగా స్టాక్ లేదని నిర్వాహకులు చెప్పడం వివాదానికి దారి తీసింది. సొసైటీకి వచ్చిన యూరియా బస్తాలు తెల్లావారేలోగా మాయమవుతున్నాయని రైతులు మండిపడుతున్నారు.

**అడ్డదారిన ఇచ్చేసిన సొసైటీ ప్రతినిధులు**

ఎరువుల యాప్‌పై అవగాహన లేని రైతులు నరకం చూస్తున్నారు. సొసైటీ అధికారుల తప్పిదాలు, ప్రైవేటు డీలర్ల మాయాజాలంతో వారి ఇబ్బందులు రెట్టింపయ్యాయి. యాప్‌ను ఎత్తివేసి యూరియా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం ఫర్టిలైజర్ యాప్ ద్వారా పారదర్శకంగా ఎరువుల పంపిణీ జరుగుతోందని చెబుతున్నారు. మాచారెడ్డి సొసైటీలో యూరియా యాప్‌తో సంబంధం లేకుండా 103 బస్తాలు వేరేవారికి ఇవ్వడం వాస్తవమేనని వెల్లడించారు. అవగాహన రాహిత్యంతో విధులు నిర్వహించిన సిబ్బందికి సస్పెండ్ నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండా సకాలంలో అందరికి అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## దొర్లిపడిన బండరాయి

● 8 మంది కూలీలు మృతి

**టీ మీడియా ,జూలై 2, బెంగళూరు :**



కర్ణాటకలోని బెంగళూరు ప్రాంతంలో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. మాద పట్టణ సమీపంలోని ఒక రాతి క్వారీలో భారీ బండరాయి కూలిపోవడంతో బిహార్‌కు చెందిన 8 మంది కూలీలు మరణించారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో సహాయక చర్యలు చేపట్టారు.

**పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం**

ఈ విషాద ఘటన బెంగళూరు దక్షిణ తాలూకాలోని మాదపట్టణలో ఉన్న ఓ స్టోన్ క్రషర్ సైట్‌లో గురువారం తెల్లవారుజామున జరిగింది. రోజూవారీ కూలీలుగా పనిచేస్తున్న కార్మికులు క్వారీలో ఎప్పటిలాగే పనులు చేస్తుండగా, సుమారు 40 అడుగుల ఎత్తు నుంచి ఒక్కసారిగా ఓ భారీ బండరాయి వారిపైకి కుప్పకూలింది. ఈ ప్రమాదంలో బండరాయి కింద నలిగిపోయి 8 మంది కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాద సమయంలో అక్కడ మొత్తం 18 మందికి పైగా కార్మికులు ఉన్నట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. గాయపడిన వారిని హుటాహుటిన సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉంది. మృతులంతా బిహార్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించిన పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, శిథిలాలను తొలగిస్తూ ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అని గాలిస్తున్నారు. క్వారీ నిర్వహణలో భద్రతా ప్రమాణాల ఉల్లంఘన ఏమైనా జరిగిందా? నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**స్పందించిన కర్ణాటక ముఖ్యమంత్రి**

ఇదిలా ఉండగా, ఈ ప్రమాద ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ ఎక్స్?లో స్పందించారు. "బెంగళూరు దక్షిణ తాలూకాలోని మదపట్టణలో గోడ కూలి 8 మంది కార్మికులు మరణించడం తీవ్ర విచారకరం. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా. కార్మికుల ప్రాణ రక్షణ, భద్రతను కల్పించడం క్వారీ యజమానుల బాధ్యత. నిబంధనలను ఉల్లంఘించే క్వారీలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది" అని ఎక్స్?లో రాసుకొచ్చారు. మరోవైపు, ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్న కార్మికుడు ఒకరు ప్రమాద ఘటనపై వివరాలు వెల్లడించారు. బండరాయి పైభాగంలో కొందరు పనిచేస్తుండగా అకస్మాత్తుగా ఆ బండరాయి కిందకు దొర్లిందని చెప్పాడు. ఒక వేళ పైన ఉన్నవారు మాకు ముందుగా సమాచారం ఇచ్చి ఉంటే, చాలా మంది ఈ ప్రమాదం నుంచి తప్పించుకుని ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రమాద స్థలిలోనే 8 మంది కార్మికులు మరణించారని, గాయపడిన మరో ఐదుగురిని చికిత్స కోసం రాజరాజేశ్వరి ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జిగా అశోక్ కుమార్

**టీ మీడియా ,జులై 2, అమరచింత:**



మక్తల్ అసెంబ్లీ రెండవ ఇంచార్జ్ గా అమరచింత పట్టణానికి చెందినఅజ్జపగా అశోక్ కుమార్ కి బాధ్యతలు ఇచ్చారు. అలాగే ఆత్మకూర్ మండల అధ్యక్షులు గా మొట్లంపల్లి గ్రామానికి చెందినగుడిసె శ్రీనివాస్ ని ఆత్మకూర్ మండల అధ్యక్షులు గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా అసెంబ్లీ అధ్యక్షులు కొక్కు గౌతమ్ మాట్లాడు అణగారిన వర్గాలన్నింటికి అధికారం దక్కలంటే ఎస్సీ, ఎస్టి, బిసి, మైనారిటీ ప్రజలకు రాజ్యాంగం లో ఉన్న చట్టాలు ప్రజలకు నేరుగా అందాలంటే అది ఒక్క బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్కూర్ పట్టణ అధ్యక్షులు మహదేవ్, కృపయ్య పాల్గొన్నారు.

## విద్యార్థినికి జ్వరం

**6 కిలోమీటర్లు వీపుపై మోస్తూ ఆసుపత్రికి తీసుకెళ్లిన వార్డెన్?**

**టీ మీడియా ,జూలై 2, మన్యం :**



శాస్త్రసాంకేతిక రంగలో మనం ప్రపంచంతో పోటీ పడుతున్నాం. కానీ దేశంలోని చాలా ప్రాంతాలకు ఇప్పటికి సరైన రహదారి సౌకర్యాలు లేవు. ఇక కొండకోనల్లో ఉండే గిరిజనుల పరిస్థితి మరీ దయనీయం. అక్కడ ఎవరైనా అనారోగ్యానికి గురయ్యారంటే దినదిన గండమే. ఎందుకంటే వైద్యం కోసం సాహసం చేయాల్సిందే. బాధితులను ఆసుపత్రికి తరలించేందుకు సరైన మార్గం ఉండదు. డోలీ కట్టి కొండలు, గుట్టల నడుమ కిలోమీటర్ల మేర నడుస్తూ రహదారి చేరుకోవాల్సిందే. అక్కడ నుంచి అంబులెన్స్ లేదా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే గానీ ఆసుపత్రికి చేరుకోలేని దయనీయ స్థితి వారిది. మరోవైపు సీఎం చంద్రబాబు ఓ పక్కన రాష్ట్రంలో ఎక్కడా డోలీలు కనిపించకూడదు అని అధికారులను ఆదేశిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఏ మాత్రం మారడం లేదు. కొన్నిచోట్ల కొండ గ్రామాల్లో రహదారులు లేక, మరికొన్ని చోట్ల ఫీడర్ అంబులెన్స్?లకు మార్గం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి సదుపాయం లేక అత్యవసర పరిస్థితిల్లో అవస్థలు పడుతున్నామని వారు వాపోతున్నారు. తాజాగా ఓ బాలిక తీవ్ర జరంతో బాధపడుతోంది. ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులు అమ్మాయి చదువుతున్న పాఠశాల వార్డెన్?కు తెలియజేశారు. వార్డెన్ వెంటనే విద్యార్థిని గ్రామానికి చేరుకుంది. బాలిక పరిస్థితి చూసి ఆమె చలించిపోయింది. ఎలాగైనా ఆ అమ్మాయిని ఆసుపత్రికి తరలించాలని అనుకుంది. కానీ అక్కడికి చేరుకునేందుకు సరైన రోడ్డు మార్గం లేకపోవడతో ఆ వార్డెన్ ఆ బాలికను నడుముకు కట్టుకొని రాళ్లు తేలిన రహదారి గుండా నడిచి ఆ బాలికను ఆసుపత్రిలో చేర్చి మానవత్వాన్ని చాటుకుంది. ఈ సంఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాల హాస్టల్ వార్డెన్?గా హేమని విధులు నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాలలో చదువుతున్న 7వ తరగతి విద్యార్థిని భువనేశ్వరి తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. ఈ విషయాన్ని భువనేశ్వరి కుటుంబ సభ్యులు వార్డెన్?కు తెలియజేశారు. భువనేశ్వరిని ఆసుపత్రికి తరలించాలని హేమని అనుకుంది. కానీ గ్రామం నుంచి రవాణా సౌకర్యం లేకపోవడంతో హుటాహుటిన భువనేశ్వరిని నడుముకు కట్టుకొని హేమని బయల్దేరింది. ఆరు కిలోమీటర్లు రాళ్లు తేలిన రహదారి గుండా ప్రయాణించి బాలికను మన్యం జిల్లా ఆసుపత్రిలో చేర్పించి విధి నిర్వహణలో నిబద్ధతను చాటుకుంది. ప్రస్తుతం భువనేశ్వరి ఐసీయూలో చికిత్స పొందుతుంది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సంధ్యారాణి హాస్టల్ వార్డెన్? హేమనిని మెచ్చుకుని సన్మానించారు. హాస్టల్?లో దుప్పటి అడిగిన పాపానికి ఎనిమిదో తరగతి విద్యార్థిని అర్ధరాత్రి వేళ నిర్దాక్షిణ్యంగా వార్డెన్ బయటకు పంపించిన ఘటన చింతలపూడిలో ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. కానీ ఈ వార్డెన్ మాత్రం మానవత్వంతో విద్యార్థిని ఆసుపత్రికి తరలించి ఔదార్యాన్ని చాటుకుంది. ఇప్పుడు ఈ వీడియో సోషల్? మీడియాలో వైరల్?గా మారింది.

# బంగారం ఎక్కువగా వాడే దేశాల్లో భారత్ రెండో స్థానం

**• అదనంగా 2,000కిలోల వెలికితీతకు ప్లాన్**

**టీ మీడియా ,జూలై 2, ఢిల్లీ బ్యూరో :**

దేశంలోని ఖనిజ నిల్వలను వినియోగించుకోవడం ద్వారా బంగారం ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా జొన్నగిరి గ్రామంలో భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ బంగారు గని కార్యకలాపాలను ప్రారంభించింది. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టులో భారీ పెట్టుబడిని పెట్టాయి. మొదటి దశలో జొన్నగిరి గని ఏటా 400 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేస్తుందని అంచనా. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా కార్యరూపం దాల్చిన తర్వాత ఈ బంగారు గని నుంచి ఏటా 2,000 కిలోల వరకు పసిడిని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కొత్త గని దేశ బంగారు దిగుమతులను ఎంతమేర తగ్గిస్తుంది? ఎంత విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేస్తుంది? తెలుసుకుందాం పదండి.జొన్నగిరి బంగారు గని ప్రారంభంతో దేశంలో ఉత్పత్తిలో ఉన్న గోల్డ్ మైన్స్ సంఖ్య నాలుగుకి చేరింది. 2023--24 సంవత్సరంలో దేశ పసిడి ఉత్పత్తి 1,552 కిలోలు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే సుమారు 8.3శాతం ఎక్కువ. కర్ణాటక అత్యధిక బంగారాన్ని ఉత్పత్తి చేసే రాష్ట్రంగా నిలిచింది (మొత్తం ఉత్పత్తిలో 93శాతానికి పైగా వాటా). మిగిలిన ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో జరిగింది. గనుల మంత్రిత్వ శాఖ ప్రకారం, 2025--26 ఆర్థిక సంవత్సరంలో దేశంలో మొత్తం 1,845.53 కిలోల బంగారం ఉత్పత్తి అయ్యింది. అందులో కర్ణాటకకు చెందిన హట్టి గోల్డ్ మైన్స్ కో లిమిటెడ్ నుంచే 1,692.36 కిలోలు ఉత్పత్తి జరిగింది. ఏపీ నుంచి



132.83 కిలోలు, ఝార్ఖండ్ నుంచి 20.34 కిలోల పసిడి ఉత్పత్తి అయ్యింది.

**స్వర్ణగిరి (జొన్నగిరి) ప్రాజెక్ట్ అంటే ఏమిటి?**

స్వర్ణగిరి ప్రాజెక్ట్ (గతంలో జొన్నగిరి ప్రాజెక్ట్ అని పిలిచేవారు) అంటే దేశ స్వాతంత్ర్యం తర్వాత దేశంలో ప్రారంభించిన మొట్టమొదటి భారీ స్థాయి ప్రైవేట్ బంగారు గని వెలికితీత ప్రాజెక్ట్. ఏపీలోని కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో ఉన్న ఈ బంగారు ఉత్పత్తి ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొద్ది రోజుల క్రితం ప్రారంభించారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ కోసం రూ.405 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. ఈ గని ద్వారా జియో మైసూర్ సంస్థ ఏటా 2 టన్నుల (2,000 కిలోలు) బంగారాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి ఏడాది 400కిలోలు, ఆ తర్వాతి ఏడాది 900 కిలోలు, ఆ తర్వాత నుంచి ఏటా 2 టన్నుల మేర పసిడి ఉత్పత్తి చేయాలని ప్రణాళికలు వేస్తోంది.

**స్థానికులకు ఉపాధి అవకాశాలు**

స్వర్ణగిరి ప్రాజెక్ట్ 700 మందికి ప్రత్యక్ష ఉపాధిని కల్పిస్తుందని అంచనా. ఇందులో 80శాతం ఉద్యోగాలు స్థానికులకే లభించనున్నాయి. అదనంగా వెలికితీసిన బంగారం విలువపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 4శాతం రాయల్టీ లభిస్తుంది. దీనివల్ల రాష్ట్రానికి ఏటా రూ.57 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. కర్నూలు జిల్లాలోని జొన్నగిరి, ఎర్రగుడి, పాగిడిరాయి అనే మూడు గ్రామాలలో సుమారు 597.82 హెక్టార్ల విస్తీర్ణంలో జొన్నగిరి ప్రాజెక్ట్ విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో బంగారు నిల్వలు ఉన్నట్లు గుర్తించారు.

**స్వర్ణగిరి ప్రాజెక్ట్ ప్రయోజనాలు**

దేశ పసిడి ఉత్పత్తిలో జొన్నగిరి ప్రాజెక్ట్ వాటా ప్రస్తుతం తక్కువగానే ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ తన ప్రారంభ దశలో (2026--27) సుమారు 400 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేస్తుందని అంచనా. అలా ఉత్పత్తి అంతకంతకు పెరగనుంది. స్వర్ణగిరి ప్రాజెక్ట్ భవిష్యత్తులో సుమారు 2 టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేస్తుందని అంచనా. 2025--26లో దేశం సుమారు 72 బిలియన్ డాలర్ల విలువైన 722 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఈ నేపథ్యంలో విదేశీ మారక నిల్వలపై స్వర్ణగిరి ప్రాజెక్ట్ ప్రభావం చాలా స్వల్పంగా ఉంటుందని అర్థమవుతోంది.

**బంగారం వినియోగించే దేశాల్లో భారత్ రెండో స్థానం**

ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం వినియోగించే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. అయితే దేశీయ ఉత్పత్తి వార్షిక అవసరాల్లో 0.5శాతం కంటే తక్కువగానే ఉంటోంది. దీంతో దేశం దాదాపు పూర్తిగా పసిడి దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ గణాంకాల ప్రకారం, భారత్‌లో బంగారం కోసం వార్షిక డిమాండ్ సాధారణంగా 700- 800 మెట్రిక్ టన్నుల (మీ) మధ్య ఉంటుంది. ఈ డిమాండ్ ప్రధానంగా ఆభరణాల వినియోగం, వివాహాలు, పండుగలు, పెట్టుబడి మార్గాల (బంగారు కబడ్డీలు, నాణేలు వంటివి) ద్వారా ఏర్పడుతుంది. దేశీయ మైనింగ్ ద్వారా వార్షిక అవసరాలలో 0.5శాతం కంటే తక్కువ పసిడే సమకూరుతోంది.

గనుల మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం, భారత్‌లో దేశీయ పసిడి ఉత్పత్తి ఏటా సుమారు 1.2-1.8 మెట్రిక్ టన్నుల మధ్య నమోదవుతోంది. దీనికి భిన్నంగా డిమాండ్ మాత్రం 700-800 మెట్రిక్ టన్నుల వరకు ఉంటోంది. ఫలితంగా పసిడిని భారీగా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, పసిడి ధరలు పెరిగినప్పటికీ 2025--26లో భారత్ భారీగా బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఆ ఆర్థిక సంవత్సరంలో పసిడి దిగుమతులు 24 శాతం పెరిగి, 71.98 బిలియన్ అమెరికన్ డాలర్ల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి.

**బంగారం దిగుమతుల్లో భారతదేశ ర్యాంక్ ఎంత?**

స్టాటిస్టా వెబ్‌సైట్ ప్రకారం, 2024లో భారతదేశం ప్రపంచంలో 5వ అతిపెద్ద బంగారు దిగుమతిదారుగా, ఆసియా దేశాల్లో 3వ స్థానంలో ఉంది. భారతదేశం 51.8 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది ప్రపంచ బంగారు దిగుమతుల్లో 9శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ (ఐటిసి) ప్రకారం, 2024లో అంతర్జాతీయ బంగారు మార్కెట్‌లో దిగుమతి వాటా పరంగా భారతదేశం కంటే ముందున్న ఇతర ప్రధాన దిగుమతిదారుల్లో స్విట్జర్లాండ్ (18.3%), చైనా (17.9%), యూకే (13.4%), మరియు హాంగ్ కాంగ్ (11.4%) ఉన్నాయి.

## అమెరికా హోటల్‌లో అగ్నిప్రమాదం

**• గుజరాత్‌కు చెందిన కుటుంబం మృతి**



**టీ మీడియా ,జూలై 2, వాషింగ్టన్:**

అమెరికాలోని ఒక హోటల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. అక్కడ పనిచేస్తూ నివసిస్తున్న గుజరాత్‌కు చెందిన భార్యాభర్తలు, వారి కుమార్తె మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. గుజరాత్‌లోని ఖేడా జిల్లా నాడియాడ్‌కు చెందిన హితేష్‌భాయ్ సుతార్, ఆయన భార్య హీనాబెన్, 20 ఏళ్ల కుమార్తె ఇషాని రెండేళ్ల కిందట అమెరికాలో స్థిరపడ్డారు. ఒహియోలోని 'ఎకానో లాడ్జ్'లో హితేష్‌భాయ్ పనిచేస్తుండటంతో ఆ కుటుంబం అక్కడ నివసిస్తున్నది.కాగా, గురువారం తెల్లవారుజామున ఆ హోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. అక్కడ నివసిస్తున్న హితేష్‌భాయ్ కుటుంబం మంటలు గమనించి ఆందోళన చెందారు. సహాయం కోసం లాడ్జి ఫ్రంట్ డెస్క్‌కు ఫోన్ చేశారు. తమను కాపాడాలని ప్రాధేయపడ్డారు. హితేష్‌తో మాట్లాడిన వ్యక్తి భద్రత కోసం బాత్‌రూమ్‌లో ఉండాలని, నీటిని ఆన్ చేసి ఉంచమని సలహా ఇచ్చాడు. ఆ తర్వాత ఎమర్జెన్సీ నంబర్లకు ఫోన్ చేశాడు.మరోవైపు ఫైర్ సిబ్బంది ఆ హోటల్ వద్దకు చేరుకున్నారు. పలు గంటలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. బాత్‌రూమ్ లోపల ఉన్న హితేష్‌భాయ్ కుటుంబాన్ని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దట్టంగా కమ్ముకున్న పొగకు ఊపిరాడక ఆ కుటుంబంలోని ముగ్గురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. హితేష్‌భాయ్, అతడి భార్య, కుమార్తె మరణం గురించి గుజరాత్‌లోని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

## ఆత్మహత్య చేసుకున్న వృద్ధురాలు

**టీ మీడియా, జులై 2, రామకృష్ణాపూర్:**



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని భగత్ సింగ్ నగర్ లో నివసించే శారీఫబి ( 71) అనే వృద్ధురాలు జీవితం మీద విరక్తి చెంది ఉరి వేసుకొని మృతి చెందడం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారీఫబి మానసికంగా కలత చెంది,తనలో తాను ఒంటరిగా మాట్లాడుకుంటూ ఉండేదనీ,గతరాత్రి భోజనం చేసిన తర్వాత ఎవరి గదులలో వారు నిద్రపోయామని,తాను లేచిచూసినప్పుడు తన తల్లి నిద్రపోయే ఉన్నదని,ఆ తరువాత ఉదయం 05:15 సమయంలో లేచి చూడగా తన తల్లి నిద్రిస్తున్న గది తలుపులు దగ్గరగా వేసి ఉండటంతో గదిలోకి వెళ్లి చూడగా గదిలో రేకులకు ఉన్న ఇనుప పైపుకు చున్నీతో ఉరి వేసుకొని కనపడినదని,జీవితం మీద విరక్తి చెంది తన తల్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని,సదరు పిర్యాదు ఇచ్చిన దరఖాస్తు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టుగా పట్టణ ఎస్సై శ్రీధర్ తెలిపారు.

## 14 వరకు తెలంగాణ జర్నలిస్టు కేవీఆర్‌కు రిమాండ్

**టీ మీడియా, జులై 2, అమరావతి :**



ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో తెలంగాణ జర్నలిస్టు కేవీఆర్ కు బొబ్బిలి కోర్టు ఈనెల 14వ తేదీ వరకు రిమాండ్ విధించింది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బాడంగి పోలీసులు కేవీఆర్( కె వెంకటరామిరెడ్డి) ని అరెస్టు చేసి ఏపీలోని విజయనగరం జిల్లా బొబ్బిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.గురువారం బొబ్బిలి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో బొబ్బిలి జైలుకు తరలించారు. భారత రాజ్యాంగం, ఏపీ నాయకులపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని కేవీఆర్‌పై విజయనగరం జిల్లా బాడంగి మాజీ సర్పంచ్ కండి రమేష్ ఏప్రిల్ 10న బాడంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.విచారణకు హాజరు కావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినా పట్టించుకోకపోవడంతో గత మంగళవారం బొబ్బిలి గ్రామీణ సీఐ శ్రీనివాస్‌తో కూడిన పోలీసులు కేవీఆర్‌ను ఇంటి వద్ద అరెస్టు చేసి తీసుకెళ్లారు.


## అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

**టీ మీడియా, జులై 2, రైల్వేకోడూరు :**



సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ గారిని, తెల్లవారుజామున మఫ్టీలో పోలీసులు చుట్టూ ముట్టి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు, సిఐటియు, మండల కార్యదర్శి పి.జాన్ ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు, ఉపాధి, చట్టాన్ని రద్దు చేసి పథకాన్ని ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం మంగంపేట బేరైటీస్ బల్క్ టెండర్ రద్దు చేయాలని, బేరైటీస్ మిల్లులు కు ముడిసరికి ఇచ్చి, కార్మికులను ఆదుకోవాలని, పునరావాస అవుట్సోర్సు రెగ్యులర్ చేయాలని, పాత ఉపాధి చట్టాన్ని, అమలు చేయాలని, పిలుపునిచ్చినందుకు, పోలీసుల చేత అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గం అన్యాయమని ఖండించారు. తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని హెచ్చరించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని. బల్క్ టెండర్ వద్ద వరకు పోరాటం కొనసాగుతుందని, అక్రమ అరెస్ట్ చేసిన నాయకుల విడుదల చేయాలని, తప్పుడు కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల సహాయ కార్యదర్శి బండారు రాజశేఖర్ పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు పరిశీలించిన ఎస్ ఐ



**టీ మీడియా,2 ,పెబ్బేరు:**పెబ్బేరు పట్టణ ఎస్ ఐ బై పాస్ రోడ్డు లను పర్యవేక్షించారు .గత కొద్ది రోజులుగా పెబ్బేరు బైపాస్ రోడ్డు లో అటు రంగాపూర్ వెళ్లే రూటు గాని ఇటు కొత్తకోట వెళ్లే రోడ్డు గానీ ఇటీవలి కాలంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి ఈ ప్రమాదాల నేపథ్యంలో రాత్రి సమయంలో నేషనల్ హైవేపై ఉన్న హైమాస్ట్ లైట్లు వెలుగుతున్నాయా లేదా అని సందేహంతో పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్ తన టీం తో కలిసి సాయంత్రం హైవేపై ఉన్న లైటులను పరిశీలించారు చాలా చోట్ల లైట్లు మరమ్మతులకు గురైనట్లు ఆయన గుర్తించారు ఈ విషయాన్ని నేషనల్ హైవే అధికారులకు తెలియజేసి వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ ఐ వెంకటేష్ గౌడ్ తెలిపారు.

# దేవరకద్రలో కొత్త సివిల్ కోర్టు ప్రారంభం

**టీ మీడియా ,జూలై 2, దేవరకద్ర :**

దేవరకద్ర మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన, సత్వర న్యాయ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నూతన 'జూనియర్ సివిల్ జడ్జ్ కం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు' బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ నూతన కోర్టు భవనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రావణ్ కుమార్, గౌరవనీయులైన హైకోర్టు జడ్జి మాధవి, జిల్లా జడ్జి హేమలత, జిల్లా కలెక్టర్ కుషఢ్బు గుప్తా మరియు స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు కోర్టు ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పలు కీలక అంశాలను పంచుకున్నారు.

**సులభతర న్యాయ సేవలే లక్ష్యం: జిల్లా జడ్జి హేమలత**

జిల్లా జడ్జి హేమలత మాట్లాడుతూ.. నూతన కోర్టు ఏర్పాటుతో




స్థానిక ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. ఈ కోర్టు అందుబాటులోకి రావడం వల్ల పెండింగ్ కేసుల విచారణ ప్రక్రియ వేగవంతం కావడమే కాకుండా, న్యాయ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు చిన్నపాటి న్యాయపరమైన అవసరాల కోసం కూడా సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఇకపై ఉండదని ఆమె పేర్కొన్నారు.దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సివిల్ కోర్టు ఏర్పాటు కావడం వెనుక ఎన్నో ఏళ్ల ప్రజల ఆకాంక్ష ఉందని, అది నేడు సాకారం కావడం ఎంతో ఆనందంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తెలిపారు. కోర్టు ప్రారంభం వల్ల ప్రజల ప్రయాణ సమయం, ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతాయని ఆయన వివరించారు. ప్రజలకు న్యాయం చేరువ చేయాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని చెబుతూ, నియోజకవర్గ అభివృద్ధిలో ఇది ఒక మైలురాయి అని ఆయన పేర్కొన్నారు.ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని చూసి నియోజకవర్గ ప్రజలు, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఉన్న తమ కోరికను నెరవేర్చినందుకు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి, సహకరించిన న్యాయ వ్యవస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఇస్రోకు బాంబు బెదిరింపు మెయిల్..

**• బాంబ్ స్క్వాడ్ తనిఖీలు**

**టీ మీడియా ,జూలై 2, హైదరాబాద్ బ్యూరో :**



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. బెంగళూరు లోని ఇస్రో ప్రధాన కార్యాలయానికి గురువారం ఈ బెదిరింపు ఈ-మెయిల్ వచ్చినట్లు ఇస్రో సిబ్బంది తెలిపారు. దాంతో అప్రమత్తమైన ఇస్రో సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. బాంబు స్క్వాడ్‌తో హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకున్న పోలీసులు ఇస్రో ప్రాంగణంలో సిబ్బందిని ఖాళీ చేయించి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.ఇది నకిలీ బాంబు బెదిరింపు అయి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ-మెయిల్ ఎవరు పంపారు..? ఎక్కడి నుంచి వచ్చిందన్న దానిపై దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇదిలావుండగా ఢిల్లీ పోలీసులు నకిలీ బాంబు బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. యూపీలోని ఘజియాబాద్‌కు చెందిన అతడు.. ఎన్ఐఏ, డీఆర్‌డీఓ, కేంద్ర పౌర విమానయాన శాఖ సహా పలు ప్రభుత్వ కార్యాలయాలకు బెదిరింపు మెయిల్స్ పంపించినట్లు పోలీసులు వెల్లడించారు.సాంకేతికత సాయంతో నిందితుడిని గుర్తించి కస్టడీలోకి తీసుకున్నారు. అతడు కొన్నేళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నివాసంలో ఎలాంటి పేలుడు పదార్థాలుగానీ, అనుమానాస్పద వస్తువులు గానీ లభించలేదని పేర్కొన్నారు.

## ఎట్టకేలకు ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేసిన రబ్రీదేవి

**టీ మీడియా ,జూలై 2, పాట్నా:**




బీహార్ మాజీ సీఎం రబ్రీ దేవి ఎట్టకేలకు ప్రభుత్వ అధికార బంగ్లాను ఖాళీ చేశారు. బీజేపీ ప్రభుత్వం పలు నోటీసులు జారీ చేయడంతో 20 ఏళ్లుగా నివసిస్తున్న పాట్నాలోని 10 సర్క్యులర్ రోడ్ బంగ్లాను గురువారం ఆమె కుటుంబం వీడింది. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) అధ్యక్షుడు, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీ దేవి కుటుంబం సుమారు 20 సంవత్సరాలుగా ఆ ప్రభుత్వ బంగ్లాలో నివసించారు. ఆర్జేడీ ప్రభుత్వ హయాంలో, ఆ తర్వాత కూడా ఆ రాష్ట్రంలో అత్యంత ప్రముఖ రాజకీయ చిరునామాలలో ఒకటిగా ఈ బంగ్లా నిలిచింది.కాగా, బీహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడటంతో ఆ రాష్ట్ర రాజకీయాలు మారాయి. పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి నంద్ కిషోర్ రామ్‌కు '10 సర్క్యులర్ రోడ్' నివాసాన్ని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మే 27న భవన నిర్మాణ శాఖ ఆ బంగ్లాను మంత్రికి కేటాయించింది.మరోవైపు హార్డింగ్ రోడ్‌లోని హౌస్ నెం. 39ను రబ్రీ దేవికి అధికారిక నివాసంగా ప్రభుత్వం కేటాయించింది. ఈ నేపథ్యంలో '10 సర్క్యులర్ రోడ్' నివాసాన్ని ఖాళీ చేయాలని కోరుతూ రబ్రీ దేవి, ఆమె కుటుంబానికి నాలుగు నోటీసులు జారీ చేసింది. అయితే ఆ బంగ్లాను ఖాళీ చేయబోనని రబ్రీ దేవి భీష్మించారు.కాగా, బీహార్ ప్రభుత్వం విధించిన గడువు జూన్ 29తో ముగిసింది. గడువును జూలై 5 వరకు పొడిగించాలని రబ్రీ దేవి కోరారు. అయినప్పటికీ గురువారం ఆ నివాసాన్ని ఖాళీ చేశారు. కౌటిల్య నగర్‌లోని తమ కొత్త నివాసానికి మారారు. దీంతో లాలూ కుటుంబం దాదాపు రెండు దశాబ్దాలుగా కొనసాగిన ఆ ప్రముఖ నివాసంతో వారి అనుబంధానికి తెరపడింది. అలాగే లాలూ ప్రసాద్, బీహార్ శాసన మండలిలో ప్రతిపక్ష నాయకురాలైన రబ్రీ దేవి భద్రతను కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం తగ్గించింది.

## ఏఐ ఆధారిత నకిలీ తీర్పులను సహించేది లేదు

**• కోర్టుల్లో ప్రదర్శిస్తే వారిపై కఠినతరమైన చర్యలు**


**టీ మీడియా, జులై 2, న్యూఢిల్లీ:**



కృత్రిమ మేధాతో తయారు చేసిన తీర్పులను ఎవరైనా కోర్టుల్లో ప్రదర్శిస్తే వారిపై కఠినతరమైన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టుఆదేశించింది. కోర్టు పూర్వ తీర్పు ఆదేశాలను వెరిఫికేషన్ లేకుండా గడ్డుగి నమ్మరాదు అంటూ సుప్రీం తెలిపింది. ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ దివాళా కేసులో ఎన్సీఎల్‌టీ, ఎన్సీఎల్ఏటీ కోర్టులు ఇచ్చిన ఆదేశాలను జస్టిస్ పీఎస్ నర్సింహా, అలోక్ ఆరాధేలతో కూడిన ధర్మాసనం కొట్టిపారేసింది. ఆ కేసులో నకిలీ, అమలులో లేని, ఊహాజనిత ఏఐ ఆధారిత తీర్పుల ఆధారంగా ఎన్సీఎల్‌టీ కోర్టు తీర్పు ఇచ్చినట్లు సుప్రీకోర్టు తెలిపింది.ఎటువంటి వెరిఫికేషన్ లేకుండా.. ఏఐ ఆధారిత అంశాలను సమర్పిస్తే, ఆ కేసుల్లో ఎవర్నీ సహించాల్సిన అవసరం లేదని సుప్రీం వెల్లడించింది. కోర్టులన్నీ కఠిన చర్యలు తీసుకోవాలన్నది. అలాంటి తీర్పులను సమర్పించే న్యాయవాదులు తప్పుగా ప్రవర్తిస్తున్నట్లు అవుతుందని కోర్టు తెలిపింది. ఓ నకిలీ, ఊహాజనిత ఏఐక ఆధారిత విషయాలపై ఆధారపడడం.. అది జడ్జీల నిర్లక్ష్యం అవుతుందని సుప్రీంకోర్టు పేర్కొన్నది.ఏఐతో చేసిన నకిలీ తీర్పులను నమ్మి.. కోర్టులు తీర్పులు ఇవ్వడం చట్టం దృష్టిలో న్యాయమే కాదు అని ధర్మాసనం పేర్కొన్నది. నిర్ణయాత్మక ప్రక్రియలో ఒకవేళ నకిలీ అంశం వస్తే, ఆ నిర్ణయాలను పక్కన పెట్టాలని కోర్టు పేర్కొన్నది. కృత్రిమ మేధతో జరుగుతున్న న్యాయపరమైన మోసాలను పరిశీలించేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఓ కమిటని ఏర్పాటు చేయాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొన్నది.కోర్టు ముందు నకిలీ, ఊహాజనిత అంశాలను పొందుపరిచే లాయర్లపై చర్యలు తీసుకునే రీతిలో మార్గదర్శకాలను బీసీఐ రూపొందించాలని సుప్రీం తన ఆదేశాల్లో వెల్లడించింది. ఏఐ ఆధారిత నకిలీ తీర్పుల వల్ల న్యాయ వ్యవస్థకు తీవ్ర ప్రమాదం ఉన్నట్లు సుప్రీం బెంచ్ చెప్పింది. నకిలీ ఆదేశాలను ప్రవేశపెట్టడం అంటే న్యాయ వ్యవస్థలోకి ప్రాణాంతక మిథైల్ ఐసోసయనేట్ రిలీజ్ చేయడమే అవుతుందని సుప్రీం బెంచ్ చెప్పింది.

## నూతన ఎంవీఐ నీ సన్మానించిన చైర్మన్

**టీ మీడియా, జులై 2 ,పెబ్బేరు:**



పెబ్బేరు నూతన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మేఘా గాంధీని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖలో ఎంవీఐ బాధ్యతలు కీలకమైనవని వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు వెంకటేష్ సాగర్ రణధీర్ రెడ్డి సురేందర్ గౌడ్ లక్ష్మణ్ పాల్గొని నూతన ఎంవీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు సుగురు విద్యార్థిని ఎంపిక



**టీ మీడియా, జులై 02 పెబ్బేరు:**వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని సుగూరు గ్రామానికి చెందిన విద్యార్థిని నిజామాబాద్ జిల్లాలో 3 4 5 వ తేదీలలో జరగనున్న సబ్ జూనియర్ గర్ల్స్ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ టోర్నమెంట్ కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సూగూరు లో చదువుతున్న 8వ విద్యార్థిని కుమారి జి శారద వనపర్తి జిల్లా సబ్ జూనియర్ గర్ల్స్ ఫుట్ బాల్ జట్టుకు ఎంపిక అయినట్లు పాఠశాల గజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయులు ఆర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలియజేశారు ఇట్టి ఎంపికలను పి జె పి క్యాంప్ పెబ్బేరు ఫుట్ బాల్ క్రీడా మైదానంలో 01 07 2026న జరిగాయని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎండి షబ్బీర్ తెలియజేశారు క్రీడాకారిణి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల బృందం విద్యార్థినీ ఆశీర్వదిస్తూ అభినందించారు.



## 'వీబీ జీ రామ్ జీ' జాతీయ పథకం ప్రారంభం

**ఆంధ్రప్రదేశ్ నుంచే అధికారికంగా**

**టీ మీడియా ,జూలై 2, రైల్వే కోడూరు :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశ చరిత్రలోనే మరో అద్భుతమైన చారిత్రక ఘట్టానికి వేదికగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన ఉపాధి పథకం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్' ఆంధ్రప్రదేశ్ నుంచే అధికారికంగా ప్రారంభమై, దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలో జరిగిన ఒక భారీ బహిరంగ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ కలిసి ఈ బృహత్తర పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ముక్కవారిపల్లి గ్రామంలో సుమారు రూ. 4.55 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన మూడు వినూత్న పనులకు ముగ్గురు నేతలు ఒకే వేదికపై శ్రీకారం చుట్టారు. ఈ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం.. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకం కార్యక్రమాలను 'వీబీ జీ రామ్ జీ మిషన్' కింద దేశంలోనే తొలి పనులుగా ప్రారంభించడం విశేషం.

**జాబ్ కార్డుల పంపిణీ**

పథకం ప్రారంభోత్సవం అనంతరం గ్రామానికి చెందిన స్థానిక లబ్ధిదారులకు కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలు స్వయంగా కొత్త జాబ్ కార్డులను అందజేసి అభినందనలు తెలిపారు. ఇదే వేదికపై కేంద్ర మంత్రులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ కలిసి ఈ పథకానికి సంబంధించిన ప్రత్యేక ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. అలాగే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ మిషన్‌కు సంబంధించిన అధికారిక సమాచార బుక్‌లెట్‌ను మరియు ఇతర ప్రచురణలను విడుదల చేయగా, నేతలంతా కలిసి కంప్యూటర్ బటన్ నొక్కి పథకం యొక్క 'అధికారిక వెబ్ పోర్టల్' ను ప్రపంచానికి పరిచయం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు శాశ్వత ఆస్తుల సృష్టి ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ పథకం ముందుకు సాగనుంది. ఏపీ వేదికగా ఈ పథకానికి అంకురార్పణ జరగడం పట్ల రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా కూటమి ప్రభుత్వ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు , పెద్ద సంఖ్యలో గ్రామీణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అప్పుల చర్చపై సవాళ్లు

**సమస్య తలెత్తుతుందనే ఉద్దేశంతో పోలీసులు తెలంగాణ భవన్ ప్రధాన ద్వారం వద్దే కేటీఆర్ పాదయాత్రను అడ్డుకున్నారు. ముందుకు వెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు.**

**తెలంగాణ భవన్ వద్ద తీవ్ర తోపులాట, ఉద్రిక్తత**

పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగాయి. పోలీసుల బారికేడ్లను దాటుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున తోపులాట, నెట్టివేతలు జరిగాయి. ఈ పరిణామాలతో తెలంగాణ భవన్ పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని చర్చల నుండి పారిపోతోందని బీఆర్ఎస్ నేతలు ఈ సందర్భంగా తీవ్రంగా విమర్శించారు.